నా మాటలు...

"జననీ జన్మ భూమిశ్చ - స్వర్గాదపీ గరీయసి" జన్మనిచ్చిన తల్లి, జన్మించిన మాతృభూమి స్వర్గం కన్నా గొప్పవి. ముందుగా నాకు జన్మనిచ్చిన నా మాతృమూర్తి అరిశా ఆదిలక్షమ్మ, పితృ దేవులు అరిశా సత్యనారాయణ గార్లకు వందనాలు తెలుపు కుంటున్నాను. నా తల్లిదండ్రులకు, నేను పుట్టి పెరిగి, నడయాడిన నా పురిటి గడ్డ నెల్లూరుకు నేను రుణప డిఉన్నాను.

నిజానికి నా మొదటి కథల సంపుటి "నల్ల సూరీడు" కంటే ముందే ఈ "విజయమహల్ సెంటర్ కథలు" సంపుటి వెలువడాల్సినది. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ పని చేయలేక పోయాను.

నేను పుట్టి పెరిగింది నెల్లూరులో. మాది అవసరాలకు , విలాసాలకు మధ్య అంతరాలను బేరీజు వేసుకుంటూ అవసరాలకే ప్రధమ ప్రాధాన్యతను ఇచ్చే అతి సాధారణ దిగువ మధ్య తరగతి కుటుంబం. మా నాయన చిన్న సన్నకారు రైతు. పంట నుంచి వచ్చేదానికన్నా పోయేదే ఎక్కువ. అమ్మ దండ ఎప్పుడూ కుదవ నుంచి ఇంటికి తేవడం నా చిన్నప్పుడు చూడలేదు. చాలీచాలని ఆదాయంతో బతకలేక పొగడ దొరువు కండ్రిగలో ఉన్న పొలాన్ని పనివాళ్ళకి అప్పగించి, బతుకు తెరవు కోసం నెల్లూరుకు వచ్చింది మా కుటుంబం. నెల్లూరు సంతపేట బి.ఎడ్. కాలేజీలో చిన్న గుమస్తాగా చేరాడు

మా నాయన. సెలవు దినాల్లో పొలం చూసుకునే పని. మా అమ్మ గృహిణి. నాయన తెచ్చిన రూపాయితోనే గుట్టుగా సంసారాన్ని నడిపిన మధ్యతరగతి మహారాణి, ఆర్థికవేత్త, ప్రేమమయి, త్యాగమయి, మాకు సర్వస్వము మా అమ్మ. ప్రాధమిక అవసరాలు తిండి, బట్ట కోసం తపన పడే మాకు మరి వినోదం, విలాసం ఎక్కడనుండి వస్తాయి?

మేమే మా వినోదాన్ని వెతుక్కున్నాం. ఇంటికి వచ్చి పలకరించే మనుషులతో. నెల్లూరు టౌన్ నడిబొడ్డులో విజయమహల్ రైల్వే గేటుకు తూర్పు పక్క విజయమహల్ సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో తూర్పు, దక్షిణం మూలలో రెండు వైపులా ప్రహరీ గోడ, రెండు గేట్లు కలిగిన 20 అంకణాల ఇల్లు మాది. తూర్పు పక్క ప్రహరీ గేటు లోపల చిన్న గుంట. గుంటలో మునిసిపాలిటీ కుళాయి.ఆ కుళాయిలో మంచి నీళ్ళు పట్టుకోవడానికి ఉదయం, సాయంత్రం టంచనుగా సంకలో బిందెలతో మా ఇంటికి వచ్చే అమ్మలక్కలు. ఆ రోజుల్లో నెల్లూరులో బాలాజీనగర్, గౌడు హాస్టల్ లాంటి ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉండేది. ప్రతిరోజూ దాదాపు 30 మందిదాకా నీళ్ళ కోసం వచ్చేవాళ్ళు. వారిలో టీచర్లు, నర్సులు, అప్పడాలు లాంటి చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారు, గృహిణులు అందరు ఉండేవారు. కాదు, లేదు అనకుండా మంచినీళ్ళు పట్టుకోమంటారని అందరికీ మేమంటే ఇష్టం. వాళ్ళు నీళ్ళు తీసుకువెళుతూ కాసిన్ని కబుర్లు అమ్మకి ఇచ్చివెళ్ళేవాళ్ళు. నేనప్పుడు చిన్నపిల్లని. వాళ్ళు చెప్పే కబుర్లు అమ్మతో పాటు నేనూ వినేదాన్ని. అవన్నీ కథలవుతాయని అప్పుడు తెలియదు.

విజయమహల్ సెంటర్లో ఇల్లు. చుట్టూ పక్కల పల్లెల్లో నుంచి నెల్లూరికి పెన్షన్ కోసమో, సరుకులకోసమో, ఎరువులు, విత్తనాలకోసమో, ఇంకేదో పనికోసమో వచ్చే బంధువులు ముందు మా ఇంటికే వచ్చేవాళ్ళు. అమ్మ ఇచ్చిన కాఫీనో, మజ్జిగో తాగి తమ పనులు చేసుకునేదానికి వెళ్ళేవాళ్ళు. ఆ వెళ్ళేటప్పుడు కొన్ని పల్లె కబుర్లు, పంట పొలాల్లో వ్యవసాయపు అగచాట్లో చెప్పుకుని గుండె బరువు దించుకునేవాళ్ళు. అలా నాకు పల్లె బతుకులు కూడా ఎరుకే. నా కథల్లో పచ్చటి పొలాలు, ఎండిన బీళ్ళు, అనుభవాలతో పండిన జీవితాలు కనిపిస్తాయి.

నేను చదివింది వీధి బడిలో. శ్రీనివాస విద్యాలయం. మా ఇంటి నుంచి నాలుగు అడుగులు వేస్తే చాలు. మా బడి వచ్చేది. ఇప్పుడు ఆ ప్రాంతంలో హైవే పడింది కానీ నా చిన్నప్పుడు అక్కడ యెద్దల రేవు సంఘం ఉండేది. మా బడి ఆ సంఘం మొదట్లో ఉండేది. బడి ముందర సారాయి అంగడి, సంఘం పొడుగూతా వెనుక పక్క చల్ల కాలువ. కాలువ వెంబడి చల్లా యానాదుల గుడిసెలు. అక్కడ ప్రతి రోజు బడిలో పాఠాలతో పాటు గుడిసెల్లో ఉన్న వాళ్ళ జీవితాలు చాల దగ్గరగా చూసాను. అక్కడి పిల్లలతో

ఆడుకున్నాను.

ఊరి నడిబొడ్డు సెంటర్లో ఇల్లు. ఇక ఏ పండగొచ్చినా సందడంతా నాదే. ఊర్లోకి ఏ వింత వొచ్చినా మా సెంటర్ కి రావాల్సిందే. దసరా వేషాలు, గారడీ విద్యలు, దొమ్మరి ఆటలు, రంగుల రాట్నాలు, సర్కసులు అన్నీ మా ముంగిటనే. మా ఇంటి ముందర కొట్టును బాడుగకు తీసుకుని కరీముల్లా సాహెబ్ రిక్షాలు బడుగులకు ఇచ్చేవాడు. అలా మా ఇంటి చుట్టూ రిక్షాలు, రిక్షా వాళ్ళు ఉండేవారు. వాళ్ళ జీవన విధానం చాలా దగ్గరగా గమనించేదాన్ని. ఇక ఎన్నికలు వస్తే చాలు. సందడి మొత్తం మా ఇంటి ముందే. మా సెంటర్లో మీటింగ్ జరపకుండా ఏ పార్టీ జెండా ముందుకు వెళ్ళేది కాదు.

మా ఇంటి ప్రహరీ గోడకు లోపలి పక్క రెండు సినిమా హాళ్లు కొత్తహాలు, శ్రీనివాస మహలు వాళ్ళు పెట్టుకున్న కటౌట్లు, అందుకుగాను సినిమాలు చూడడానికి మాకు ఫ్రీ పాసులు, ఇంటి వెనుక వీధిలోనే విజయమహల్, రైలు కట్ట దాటగానే నడిచి వెళ్ళే దూరంలోనే బోలెడన్ని సినిమా హాళ్ళు, సండే మార్కెట్, కో ఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో జరిగే హరికథా కార్యక్రమాలు, సాయిబాబా గుడిలో వినపడే ప్రవచనాలు,నాట్య ప్రదర్శనలు, టౌన్ హాల్లో జరిగే త్యాగరాజస్వామి ఉత్సవాలు, రంగనాయకుల పేట తిరునాళ్ల, గరుడ సేవ రోజు రాత్రి నిద్ర వస్తే గుడిలోనే అమ్మ వొళ్ళో తలపెట్టుకుని పడుకున్న రోజులు, పెన్నా నది బ్రిడ్జి కింద స్నేహితులతో, బంధువులతో కలిసి వెళ్ళి నదిలో వదిలిన గొబ్బెమ్మలు, ఎగురవేసిన గాలిపటాలు, తిరునాళ్ల లో కొనుక్కున్న మట్టి బుడ్డీలు, తీపి రుచిని తెలిపిన చెరకు గడలు, వేణుగోపాల స్వామి గుడిలో ఉత్సవాలు. రథంలో వీధి వీధిలో తిరిగే జగన్నాధుడు, రథం ఇంటి ముందుకు రాగానే పళ్లెంలోని టెంకాయ పూజారికి ఇచ్చి హారతి కళ్ళకదిద్దుకునే నా చేతులు, మిషనరీ హైస్కూల్ లో టీచర్లు చెప్పే బైబిల్ వాఖ్యలు.

రొట్టెల పండుగనాడు చదువు రొట్టె దొరకలేదని అలిగి పడుకుంటే, సాయంత్రానికి ఇంటికి వచ్చి "చదువు రొట్టె తీసుకో బేటీ " అని రొట్టెని చేతిలో పెట్టే కరీముల్లా సాయిబు అభిమానం. చల్లా ఏనాదుల సంబరం ఇరగాలమ్మ జాతరకు ఊరేగింపుగా మా పనిమనిషి సుబ్బితో కలిసి వెళ్ళడం. దేవుడు పూనిన వాళ్ళు, దెయ్యం పట్టిన మనుషులు అందరినీ వింతగా చూడడం. ఇన్ని సజీవ వినోదాల మధ్య మాకు డబ్బులు లేవనీ, మంచి తిండి, ఖరీదైన బట్టలు లేవనీ నేను ఏనాడూ బాధ పడలేదు నా బాల్యంలో.

ఉగాది రోజు వేప పూత కోసం చెట్టెక్కడం, సినిమా వదిలే సమయానికి విజయమాల్ దగ్గరకి పోయి అన్నతో పోటీపడి సిగిరెట్టు పెట్టెలు, అగ్గిపెట్టలు ఏరుకోవడం, సర్కస్ చూడడానికి డబ్బులు లేకపోయినా మధ్యాన్నాలు సర్కస్ వాళ్ళ గుడారాల దగ్గర ఏనుగులు, గుర్రాలు, బోనుల్లో ఉండే సింహాలు, విశ్రాంతి తీసుకునే

సర్కస్ అమ్మాయిలను చూసి సంబరపడడం, ఇన్ని వినోదాల మధ్య నా బాల్యం ఎంతగా వెలిగిపోయిందో.

ఈ కథలన్నీ దాదాపు నేను ఏడవ తరగతి చదివేలోపు జరిగినవే. విశాలాక్షి మాస పత్రికలో సంవత్సరం పాటు ఈ కథలు ప్రచురితం అయినాయి. ఈ కథల్లో ముఖ్యంగా రెండు కథల గురించి ఇక్కడ చెప్పుకోవాలి. అవి "బాపనోల్ల పిల్ల - ముత్తరాసి ఏనాది పిలగాడు", "దొడ్డెత్తే నరసమ్మ" కథలు. మొదటి కథలో మా పద్మక్క, మా శ్రీనివాసులు బావని ప్రేమించి పెళ్లిచేసుకుంది. వారిది కులాంతర వివాహం. అప్పట్లో ఆ వివాహం చాల వివాదాలను, విప్లవాలను, ఆదర్శాలను రేకెత్తించింది. అయినా వారు ఇద్దరు ఆదర్శ జంటగా జీవించారు. మా శ్రీనివాసులు బావ మద్రాసులో మెడికల్ ఫ్యాక్టరీ పెట్టి మన, తన బేధం లేకుండా ఎందరికో ఫ్యాక్టరీలో ఉద్యోగాలు ఇప్పించి ఉపాధి కల్పించాడు. అయితే మా దురదృష్టం ఆయన ఓ రైలుప్రమాదంలో చనిపోయారు. వారి పిల్లలు ఇప్పుడు కూడా మద్రాసులో మెడికల్ ఫ్యాక్టరీ నడుపుతూ ఎందరికో ఉపాధి కల్పిస్తున్నారు. ఇటువంటి వారి ప్రేమ కథను రాయడం నా భాధ్యత అనుకున్నాను. కులం, మతం కాదు ఎప్పటికైనా నిలిచేది మానవత్వమే అనేది నేను బలంగా నమ్ముతూ, ఈనాటికీ ఆ మాటకే కట్టుబడిఉన్నాను.

ఇక "దొడ్డెత్తే నరసమ్మ" కథ. బాలాజీనగర్, విజయమహల్ సెంటర్ ప్రాంతాల్లో పొద్దున్నే పెద్ద బొక్కెన, రెండు ఇనుపరేకులతో ప్రతి ఇంటికీ వచ్చి, పాకీ గదిలోకి వెళ్ళి, ఇంట్లోవాళ్ళు పోయిన దొడ్డిని బొక్కెనలో వేసికొని పోయేది. అప్పట్లో నరసమ్మ వీధిలో కనిపిస్తే చాలు మనుషుల ప్రవర్తన ఎలా ఉండేదో, ఆమెకి ఎంత దూరంగా జరిగే వాళ్ళో నేను ప్రత్యక్షంగా చూసాను. పసి వయసులో ఏదో ఆలోచన ఉండేది కానీ, దానికి స్పష్టత ఉండేది కాదు. కానీ ఇప్పుడు తలచుకుండే నరసమ్మ పట్ల మనుషులు ఎంత దారుణంగా ప్రవర్తించారో అని గుండె బాధతో నిండిపోతుంది. ఇప్పుడు నరసమ్మ బతికి నా ముందుకు వస్తే మా అమ్మను చూసినట్లే, నరసమ్మకు పాదాభివందనం చేసి, గుండెలకు హత్తుకోవాలని ఉంది. ఈ రెండు కథలు చాల వివాదాస్పదం అయినాయి. కానీ కథల్లో నేను ఎక్కడా ఏ కులాన్ని కానీ, వృత్తిని కానీ కించపరచలేదు. ఆ విషయం కూడా నేను చెప్పాల్సిన భాద్యత నామీద ఉంది. నామీద నమ్మకంతో నా కథలను ఏడాది పాటు ప్రచురించిన విశాలాక్షి పత్రిక సంపాదకులు శ్రీ కోసూరి రత్నం గారికి, శ్రీ ఈతకోట సుబ్బారావు గారికి వేనవేల కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అలాగే "రూపాయి దేవుడు" అనే కథను ప్రచురించిన నవమల్లెతీగ సంపాదకులు శ్రీ కలిమి శ్రీ గారికి, " గంగరావి చెట్టు కింద ఇరగలమ్మో", "చిరంజీవే నా మొగుడు" అనే కథలను ప్రచురించిన శ్రీ గుడిపాటి వెంకట్ గారికి, అంతర్వాహిని కథల సంకలనంలో నా కథ " సైన్స్ రికార్డు

- కొబ్బరి చట్నీ" కి అవకాశం కల్పించిన శ్రీమతి శాంతి కృష్ణ గారికి, "దొడ్డెత్తే నరసమ్మ" కథను "కర్పూర దీపం" పేరుతో వీధి అరుగు పత్రికలో ప్రచురించిన శ్రీ శ్రీనివాస్ కాంద్రు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

నా కథల్లోని పాత్రధారులు కొందరు ఇప్పుడు లేరు. కొందరు సజీవంగా ఉన్నారు. వారందరికీ నేను ఆజన్మాంతం రుణపడి ఉంటాను. ఎప్పుడు ఏ సందేహం వచ్చి అడిగినా కథలో మార్పుల గురించి నాకు తెలిపేవారు శ్రీ ఎం.వి. రామిరెడ్డిగారు, శ్రీ ముని సురేష్ పిళ్ళె గారు. వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. నన్ను సాహితీ లోకానికి పరిచయం చేసిన మా గురువుగారు శ్రీ జగన్నాథ శర్మగారికి ప్రత్యేక ధన్యవాదాలు. కథలను డి.టి.పి.కి పంపిన దగ్గర నుంచి పుస్తకాలు ప్రింట్ అయి ఇంటికి వచ్చేవరకు, కనీసం ఒక్కసారి కూడా ప్రూఫ్ చూడనవసరం లేనంతగా బాధ్యతను తీసుకుని పుస్తకాలు నాకు అందించిన ఆదర్శిని ప్రచురణ కర్తలు, ప్రముఖ కథకులు శ్రీ ముని సురేష్ పిళ్ళై గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఇక ముందు మాట మీరు రాయాల్సిందే సర్ అని అడగగానే ఒప్పుకుని, "తప్పకుండా రాస్తాను, కొంత సమయం వేచిఉండు తల్లీ " అని చెప్పినా సకాలంలో ముందు మాట రాసి పంపిన ప్రముఖ సాహితీవేత్త, కేంద్ర సాహితీ పురస్కార గ్రహీత శ్రీ మధురాంతకం నరేంద్ర గారికి కృతజ్ఞతలు. "దొడ్డెత్తే నరసమ్మ" కథ చదివి చలించిపోయి కథకు గొప్ప సమీక్ష రాసి పంపిన "విమల సాహితీ సంస్థ" స్థాపకులు IRS అధికారి డా. జెల్ది విద్యాధర్ రావు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. విజయమహల్ సెంటర్ కథలకు ప్రోత్సాహం ఇవ్వడమే కాకుండా మా ఇంట్లో జరిగే ప్రతి వేడుకకు, విశాలాక్షి ఆశ్రమంలో మా పేరుతో అన్నదానం జరిపించి, ఆశ్రమంలోని ఎందరో అమ్మలు, అయ్యలతో మాకు ఆశీస్సులు అందింపజేస్తున్న శ్రీ కోసూరు రత్నం గారికి, సాహితీ లోకంలో నాకొక సుస్థిరమైన స్థానం విజయమాల్ సెంటర్ కథల ద్వారా కల్పించిన శ్రీ ఈతకోట సుబ్బారావు గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. విజయమహల్ సెంటర్ కథలు విశాలాక్షి పత్రికలో వచ్చినప్పుడు కథలు చదివి నాకు ఫోన్ చేసి కథల గురించి మాట్లాడిన పాఠకులకు, వాట్సాప్ సాహితీ సమూహాల్లో కథలు పోస్ట్ చేసినప్పుడు, చదివి వారి అమూల్యమైన అభిప్రాయాలను తెలిపిన ఎందరో సాహితీ పెద్దలు, సాహితీ మిత్రులకు నా కృతజ్ఞతలు. అలాగే ఫేస్‌బుక్‌లో కథలను పోస్ట్ చేసినప్పుడు, చదివి తమ విలువైన అభిప్రాయాల్ని తెలిపి నాకు ఎంతో ప్రోత్సాహం అందించిన మిత్రులందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు. నా తోబుట్టువులకు వందనాలు. నన్ను ప్రోత్సహిస్తున్న నా నెల్లూరు సాహితీ మిత్రులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. నా పురిటిగడ్డ నెల్లూరుకు, నెల్లూరులోని ప్రముఖులకు, నెల్లూరు ప్రజలకు నా హృదయపూర్వక వందనాలు.

నా బలం, బలహీనత, నాకు నిరంతర ప్రోత్సాహం అందించి నన్ను ముందుకు నడిపించే నా కుటుంబం, నా శ్రీవారు కృష్ణమూర్తి వంజారి గారికి ప్రేమాత్మక ఆలింగనాలు. కొడుకు, కోడలు శ్రీనివాస చైతన్య, సాయి సాహిత్యలకు, నా కూతురు వైష్ణవి కి ఆశీస్సులు.

శ్రీ మధురాంతకం నరేంద్ర గారు ముందు మాటలో రాసినట్లు ఈ విజయమహల్ సెంటర్ కథలు, నేను రచనలు ప్రారంభించిన తొలినాళ్ళలో సాహితీలోకంలో నేను వేసిన తొలి అడుగులుగా భావిస్తాను. మీ అందరి ప్రోత్సహంతో నేను కథకురాలిగా ముందుకు సాగాలని మీ ఆశీస్సులు కోరుకుంటూ శిరస్సు వంచి మీ అందరికీ వినమ్ర వందనాలు తెలుపుకుంటున్నాను.

మీ

రోహిణి వంజారి

9000594630